పురుషులకు ప్రత్యేకం



# పడమటి గాలి

—చిర్రావూరి మదన్‌మోహన్

మీనా అంతరాంతరాలలో ఏదో ఒక అభద్రతాభావం మొదలయింది. తను ఇండియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. తన తల్లి దండ్రులు ఇండియాలో ఉన్నత స్థాయిలో ఉండి తనను ఎంతో గారాబంగా పెంచటమే కాకుండా గౌరవంగా కూడా పెంచారు. ఆ గౌరవాన్ని పురస్కరించుకునే తనకు అమెరికా నుండి తెచ్చిన సంబంధం ముందు వెనుక చూడకుండా తన తల్లిదండ్రులు తెచ్చిన వరుడికి తలవంచింది మీనా.

అందరూ సంతోషంతో తనను అమెరికాకు పంపిస్తుంటే ఏదో తెలియని బాధ, తనవారిని వదిలి పది వేల మైళ్ళ కవతలకి వెళుతున్నామన్న దిగులు మిళితమై మీనా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇండియాలో ఏదో మూల అంటే... కాష్మీరులో ఉన్నా, తనో... తనవారో అనుకున్నప్పుడు రావచ్చు. కానీ, ఇది విదేశాలకు సంబంధించింది. ఇటు వాళ్ళు అటు రావాలన్నా... అటువాళ్ళు ఇటు రావాలన్నా పాస్‌పోర్ట్లు, వీసా, ఎయిర్‌లైన్సులో అకామడేషన్, ఇలా చాలా గొడవలున్నాయి. అన్నీ తెలిసినా అన్నిటికి తలవంచింది మీనా, తనని కని పెంచిన తల్లి దండ్రుల కోసం.

బాధపడుతున్న మీనాను తన బాహువుల్లో తీసుకున్నాడు ఆమె భర్త రామం. పది మందిలో తనను అలా బహిరంగంగా చేతులోనికి తీసుకొని ఊరడించటం మీనాలో సిగ్గు బెరుకు కలిసిన ఓ అహం తలెత్తింది. మెల్లగా భుజం మీది అతని చేతిని తొలగించింది. బిత్తరపోయి చూశాడు ఆమె భర్త.

★ ★ ★

"ఏవండీ ఓ మాట" అప్పుడే ఆఫీసుకు వెళుతున్న రామంను పిలిచింది మీనా.

"ఏమిటి?" అంటూ అసహనంగా అడిగాడు రామం.

"అబ్బే ఏమీ లేదు.. ఈ పెన్నుకి ఓ రీఫిల్ కావాలి. మీరు ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తప్పకుండా తీసుకురండి" అని ఓ స్వతంత్రంతో కలిసిన గారాబంతో అడిగింది మీనా.

రామం ఆమెనూ ఆ పెన్నును ఎగాదిగా చూశాడు. "ఆఫ్టరాల్ ఇదో పాత ఇండియన్ రీఫిల్ పెన్ను. దీన్ని పెద్ద ఆస్తిలాగా ఇండియా నించి పట్టుకొచ్చావా? ఇదుగో గోల్డ్ క్రాస్ పెన్ను. దీని ధర 50 డాలర్లు అంటే దాదాపు 1300 రూపాయలు" అని ఆ పెన్ను తన చేతిలో పెట్టి ఆ పాత పెన్నుని అక్కడున్న డస్ట్‌బిన్‌లో పడేశాడు. భర్త తనకు 1300 రూపాయల బంగారు క్రాస్ పెన్ను ఇచ్చినందుకు సంతోషం కన్నా తన పాత పెన్నును వేస్ట్ పేపర్ బాస్కెట్లో అలా గిరాటేయటం అనాగరికంగా అనిపించింది మీనాకి.

ఆ పెన్ను తనకు తన చెల్లెలు బర్త్‌డే గిఫ్ట్‌గా ఇచ్చింది. అదీ ఎలా? రెండు వారాల పాకెట్ మనీలో నుంచి సేవ్ చేసి. పెళ్ళిలో ఎన్నో కాస్ట్లీ పెన్ సెట్లు బహుమతిగా వచ్చినా వాటిని ముట్టుకోనుకూడా లేదు తను. తనకు ప్రేమతో చెల్లెలిచ్చిన ఆ పెన్నునే అమెరికాకు తెచ్చుకుంది. కానీ, ఇవాళ అది కాస్తా కుప్పతొట్టి పాలయింది. మీనా మనస్సు చెల్లెలిని తలుచుకొని బాధ పడింది. ఎవరో వస్తుంటే కళ్ళలో నుండి ఉబికి వస్తున్న కన్నీళ్ళను చెంగుతో తుడుచుకుంది మీనా.

★ ★ ★

ఓ రోజు రామం తొందరగా ఇంటికొచ్చాడు. భార్యను సినిమాకి వెళదాం రమ్మని చెప్పి బయట కారులో వెయిట్ చేస్తున్నాడు. ఈ న్యూయార్క్ పట్టణంలో తను వచ్చిన రోజు నుంచి రోజూ ఇంట్లో వీడియోలో సినిమాలు చూస్తూనే ఉంటారు తన కుటుంబ సభ్యులు. ఇండియాలో సినిమాల మీద ఉన్న వ్యామోహం, మోజు మీనాకు అమెరికాకు రాగానే మొహం మొత్తింది. కానీ, ఈ సాకుతో భర్తతో బయటికి వెళ్లచ్చన్న ఆశతో త్వర త్వరగా బయలు దేరింది. తొందరలో వాచీ పెట్టుకుంటూంటే చెయిన్ తెగి వాచీ క్రింద పడింది. ఏదో అపశకునంలా తోచింది మీనాకి. భయపడుతూనే వంగి తీసింది వాచీని.

'హమ్మయ్య' దేవుడి దయ బాగానే పనిచేస్తున్నది. తివాచీ మీద పడటంవల్ల వాచీ కేం కాలా. చెయిన్ పిన్ ఊడి తెగిపోయింది. మళ్ళీ ఓ పిన్ వేసుకుంటే సరిపోతుంది' అని మనసులో అనుకొని ఆ వాచీని హాండ్ బ్యాగ్‌లో వేసుకొని కారులో తన కోసం కాచుకున్న రామంని చేరుకుంది మీనా.

"ఇదుగో మీనా... అసలు సినిమా కోసంగాదు మనం వెళ్ళేది. ఆ ఇంట్లో రోజూ, ఆ వీడియో ముందు బ్లాక్ అయిపోయి ఈ లోకాన్నే మర్చిపోతున్న నీకు బయటి ప్రపంచాన్ని చూపిద్దామనే ఈ ప్లాన్. ఎలా ఉంది?" అని నవ్వుతూ అడిగాడు రామం.

మీనాకి అరికాలు మంట నెత్తికెక్కింది. ఇంట్లో తన అత్త, మరిది, ఆడబడుచు అందరూ తన పేరు చెప్పుకుని రోజుకు రెండు మూడు కాసెట్లు తెచ్చి వేసుకొని వాళ్ళు ఎంజాయ్ చేస్తుంటే తను చూసి చూడనట్లు ఊరుకుంటుంటే, తనేదో టి.వి. వీడియోల ముందు బ్లాక్ అయిపోయానంటారా? ఎంతైనా అమెరికాలో ఉన్నంత మాత్రాన స్వదేశంలోని వాళ్ళంటే అంతచులకన ఉండకూడదు అనుకుంది మీనా. అదీ గాక వీళ్ళు ఈ రోజున చూసే సినిమాలు తను ఇండియాలో ఎప్పుడో చూసేసింది. ఆ పాత సినిమాల కోసం తనేం తాపత్రయపడటంలా. అయినా రామం అన్నమాటలు మీనా గుండెల్లో బాణాల్లా గుచ్చుకున్నాయి.

కాసేపు ఇద్దరి మధ్య మౌనం. అది అలా కంటిన్యూ అవటం ఇష్టం లేక రామం కారాపి మీనాను వదన్న హోటల్‌కు తీసుకెళ్ళాడు. జాక్‌సన్ హైట్‌లో అదో సౌతిండియన్ ఉడిపి హోటల్. ఏం కావాలో ఆర్డరివ్వమన్నాడు రామం. మెనూ కార్డులో ఏది చూసినా ఐదు డాలర్ల కు తక్కువ లేదు. మీనా మెదడులో 25వ ఎక్కం మొదలయింది. ఐదు ఇరవై ఐదుల నూట ఇరవై ఐదు. "అమ్మ బాబోయ్" ఒక్క మసాలా దోశ నూట

పాతిక రూపాయలా? ''అబ్బే నాకేం వద్దండీ'' అంది నసుగుతూనే.

''ఛీ ఛీ అలా లోపలికి వచ్చేసి ఊరికే వెళితే బాగుండదు ఏదైనా తిను'' అని, ''ఆహా అన్నట్టు నీకు జాంగ్రీ అంటే ఇష్టం కదా'' అని అక్కడి కొచ్చిన స్టువర్డ్‌తో రెండు జాంగ్రీలు, రెండు మసాలా దోశలు, రెండు కాఫీలు ఆర్డర్ చేశాడు రామం.

టేబుల్ మీద సర్వర్ తెచ్చి పెట్టిన ప్లేటును చూస్తుంటే మీనాకి రూపాయలే కనిపిస్తున్నాయి.

''అలా చూస్తావేం తినూ'' అంటూ ప్రేమగా జాంగ్రీని నోట్లో పెట్టాడు రామం. అలా పది మందిలో బహిరంగంగా అతనలా చేయడంతో మీనాలో ఆనందంకన్నా ఒకలాంటి విత్‌డ్రాయల్ సింప్‌టమ్ ఫీలయింది.

బిల్ వచ్చింది. మొత్తం 22 డాలర్లు. టిప్‌తో సహా పాతిక డాలర్లు పెట్టాడు రామం. ఇద్దరూ బయటికి వస్తుంటే ''ఇవాళ నీ టిఫిన్ ఖర్చు 650 రూపాయలు'' అన్నాడు నవ్వుతూ. మీనాను ఎవరో చర్నాకోల్‌తో కొట్టినట్టయింది.

ఇదే ఇండియాలో అతనామాట అని వుంటే ఆ డబ్బును అతని మొఖాన కొట్టేఉండేది. కానీ అది అమెరికా. అక్కడ మన డబ్బుకు విలువ లేదు. వాళ్ళ డాలర్లు తన దగ్గర లేవు. అతడు తన భర్తే అయినా ఆమె అంతరాత్మ రామం అలా అని ఉండకూడదని ఘోషించింది. సినిమా చూస్తున్నంత సేపూ తన మనస్సు మనస్సులో లేదు. తన తల్లిదండ్రులు, ఫ్రెండ్స్, చెల్లెలు, బంధువులు తనను గారాబంగానూ గౌరవంగానూ చూసుకోవడం జ్ఞాపకం వచ్చింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి మీనాకు. హాయిగా ఆ చీకట్లో మనసు విప్పి ఏడ్చింది మీనా...

★ ★ ★

ఆ రోజు మీనా బర్త్‌డే—

మెన్ హటన్‌లో ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ చూడటానికి బయలుదేరారు మీనా, రామం. న్యూయార్క్‌లో అదే పెద్ద బిల్డింగ్. పైకెళ్ళి న్యూయార్క్‌ను నాలుగువైపులా చూడొచ్చు. రామం దారిలో కారాపాడు. మీనాను కారులోనే ఉండమని చెప్పి కాసేపట్లో ఓ చిన్న గిఫ్ట్ పాక్, ఓ ఎర్ర రోజా పువ్వుతో ప్రత్యక్షం అయ్యాడు. ఆ రోజా పువ్వును ఆమె తలలో పెట్టి ''ఇవాళ నీకో గిఫ్ట్ ప్రెజెంట్ చెయ్యాలనుకున్నా. కానీ, దాన్ని ఆకాశంలోనే ఇస్తా', అంటూ దాన్ని తన బ్రీఫ్ కేసులో దాచేశాడు రామం.

తనకు కొన్న గిఫ్ట్ ఏమై ఉంటుందా అన్న మీనా ఆలోచనలు పరి పరి విధాల పరిగెత్తడం మొదలయ్యాయి. ఇంతలో రామం వేసిన కారు బ్రేకులో ఆలోచనలకు బ్రేక్స్ పడ్డాయి. ఈ లోకంలోకి వచ్చింది మీనా. ఇద్దరూ టిక్కెట్లు కొనుక్కొని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పైకి వెళ్ళారు.

నిజంగా ఆ బిల్డింగ్‌పై అంతస్తుని ఆకాశానికి ఆరంభం అని చెప్పొచ్చు. అంత ఎత్తుకి ఒకేసారి వస్తే కళ్ళు తిరుగుతాయి అని రెండు మజిలీలుగా పంపిస్తుంటారు టూరిస్టులను.

అంత ఎత్తునుండి న్యూయార్క్‌ను నాలుగువైపులా టెలిస్కోపులో చూసి ఆనందిస్తున్న మీనా ఓ చిన్న పిల్లలాగా మారిపోయి తన ఉనికినే మర్చిపోయింది. తనతో తన తల్లిదండ్రులు, చెల్లెలు, ఫ్రెండ్స్ ఉంటే ఎంత బావుంటుందో అని అనుకుంది. ఆ ఆలోచనకు—

''మీనా టైం ఎంత?'' అన్న రామం ప్రశ్న అంతరాయం కల్గించింది.

మీనా ఇబ్బందిగా తన మొండి చేతిని చూసుకొని, హాండ్ బ్యాగ్‌లో నుంచి తన పాత వాచీని, తెగిన చైన్‌ను తీసి 4.30 అని సమాధానం చెప్పింది. అలా చెబుతున్నప్పుడు ఆమె మొఖం చిన్న బోయింది. కానీ తమాయించుకుని—

''ఏవండీ మనం కింది కెళ్ళేటప్పుడు ఓ వాచీ షాపులో దీనిని రిపేర్ చేయించుకెళదాం అండీ... ఓ పిన్ను వేసుకుంటే చాలు రిపేరయిపోతుంది.'' అంటున్న మీనా చేతిలోని వాచీని తీసుకొని జేబులో వేసుకొని తన పేకెట్‌లో నుంచి ఓ కొత్త గోల్డ్ సీకో వాచ్ ఆటోమాటిక్, డే అండ్ డేట్ ఎలక్ట్రానిక్‌ది తీసి ఆమె చేతికి స్వయంగా కట్టాడు. మీనా దాన్ని చూసి ఎంతో ఆనంద పడిపోయింది. ''దీని వెల ఎంతండీ...'' ఎంత చదువుకున్నా ఆమెలోని సహజమైన స్త్రీ తత్వం బయటికి తొంగి చూసింది.

''2500 రూపాయలు'' హుందాగా చెప్పాడు రామం.

''చాలా థ్యాంక్స్ అండీ'' కృతజ్ఞతాపూర్వకంగా చెప్పింది మీనా ''అలాగే పోతూ పోతూ నా వాచీని కూడా రిపేర్ చేసుకుందాం'' అంది.

రామం నవ్వుతూ, ''ఇంకా చెయిన్ తెగిపోయిన ఈ పాత ఇండియన్ వాచ్ ఎందుకు?'' అంటూ విలాసంగా గాలిలోకి విసిరేశాడు. అది అంత ఎత్తు బిల్డింగ్ నుంచి క్రింద పడింది. పడుతున్న ఆ వాచీని చూసి రామం ఆనందించాడు. కానీ, మీనాకు ఆ వాచి వెనకాల తన తల్లి ఆప్యాయత, పట్టుదల - తన సాధించిన ఘన విజయం జ్ఞాపకానికి వచ్చాయి.

★ ★ ★

తను స్కూల్ ఫైనల్ ఫస్ట్ ర్యాంక్‌లో పాస్ అయితే బహుమతిగా వచ్చిన గడియారం అది. దానికి దోహదం చేసింది తన తల్లి కృషి. తన కన్నా ముందు ఎవరెవరు వాచీలను బహుమతిగా పొందారో వారందరి ఫోటోలను న్యూస్ పేపర్లలో నుంచి ప్రతి సంవత్సరం కత్తిరించి సేకరించి ఓ ఆల్బంలాగా తయారు చేసింది. ఆఖరికి ఓ తెల్ల కాగితంలో తన ఫోటోను కూడా అతికించి దాని కింద ఎస్.ఎస్.ఎల్.సి.లో ఫస్టు ర్యాంక్ వచ్చిన మీనాకు ఫలాన వాచ్ కంపెనీ కానుక అని తన స్వదస్తూరితో రాసి తనను ఇన్‌స్పైర్ చేసింది తన తల్లి.

ఆ పేపర్ కట్టింగ్ ఆల్‌బమ్‌ను చూసి తనూ పట్టుదలతో చదివింది. ఆశ్చర్యం నిజంగానే తను ఫస్టు వచ్చింది. అనుకున్న ప్రకారం వాళ్ళు తనకు వాచీ ప్రెజెంట్ చేశారు. వారి ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్‌తో తను తీసుకున్న ఫోటోను చెల్లెలికి ఇచ్చింది తను. ఆమె కూడా తనలాగా పైకి రావాలని.

పెళ్ళిలో అత్తవారు కొత్తవాచీ ఇస్తానంటే వద్దంది. తీరా ఇవాళ ఆ వాచీ గాలిలో ఎగిరి మెన్ హటన్ వీధుల్లో ఎవరికీ కొరకాకుండా పడింది. తన బాధను ఎవరితో చెప్పుకోవాలి? ఎవరు అర్థం చేసుకుంటారు? ఛీ.. ఛీ... వీళ్ళూ ఒక మనుషులేనా? వీళ్ళ కసలు మనసులూ, మమతలూ ఉంటాయా? ఎప్పుడూ కొత్త మీద మోజు దాన్ని డబ్బుతో ఎలా కొనుక్కోవాలని ఆలోచనే గానీ ఇవతల వాళ్ళ మనస్సును అర్థం చేసుకోలేరా? వారి భావాలకు గౌరవం ఇవ్వలేరా? అని ఘోషించింది మీనా మనస్సు....

తన చుట్టూ ఉన్నవారిని వట్టి మెటీరియలిస్టులు అనీ తిట్టింది మీనా...

వాళ్ళు ఆమెను సెంటిమెంటల్ ఫూల్ అన్నారు.

★ ★ ★

రెండేళ్ళ తర్వాత—

న్యూయార్క్ కెన్నడీ ఎయిర్ పోర్టులో తన తల్లిని, చెల్లెలినీ రిసీవ్ చేసుకోవటానికి వెళ్ళింది మీనా. ఇద్దర్నీ ఆప్యాయంగా కౌగిలించుకొని రిసీవ్ చేసుకుంది.


''అక్కా నీకు ఇష్టం అని అమ్మ సున్నుండలు, చక్రాలు చేసుకొచ్చిందే... అవన్నీ పెట్టి నా బాగ్ కూడా చిరిగిపోయింది.'' అంది చెల్లెలు.

''మీ పిచ్చిగానీ ఇవన్నీ అక్కడి నుంచి మోసుకు రావాలా? అయినా చిరిగింది అష్టరాల్ పాత బాగేగా... అదీ ఇండియన్ బాగ్. దానికి బదులు నేను మంచి అమెరికన్ సూట్‌కేస్ కొనిస్తాలే.'' అంది మీనా.

''అది కాదక్కా అది నాకు కాలేజీలో ప్రైజ్ వచ్చింది. అందుకని అదంటే నాకో అటాచ్‌మెంట్...''

''డోంట్ బి ఎ సెంటిమెంటల్ ఫూల్'' అంటూ ఆ బ్యాగ్‌ను డిక్కీలోకి విసిరేసింది మీనా.

అమెరికాలో అప్పుడే కాలు పెట్టిన ఆ చిన్నారి చెల్లెలికి తగిలిన మొదటి కల్చరల్ షాక్ మీనాయే ఇచ్చింది.



గట్టిపడిన బ్రెడ్ ముక్కల్ని కుక్కర్ ఆవిరికి రెండు సెకన్లు వుంచితే మెత్తబడి ఫ్రెష్‌గా అవుతాయి.

* * *

పూరీలు రుచిగా వుండాలంటే నీళ్లలో తడిపిన రెండు మూడు బ్రెడ్ స్లైసులను కూడా పూరీల పిండిలో చేర్చి కలపాలి.